క్లుప్తంగా

వేడుకగా హనుమాన్ శోభాయాత్ర



దుగ్గొండి : మండలంలోని గుడ్డెలుగులపల్లిలో హనుమాన్ మాలధారులు బుధవారం సాయంత్రం శోభాయాత్ర వేడుకగా నిర్వహించారు. హనుమాన్ భక్తుల ఆటపాటలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. హనుమాన్ మాలధారులు అత్యంత భక్తిశ్రద్ధలతో నినాదాలు చేస్తూ హోరెత్తించారు. కార్యక్రమంలో హనుమాన్ మాలధారులు జంగిలి రవి, తొర్రూరు రామన్న, జంగిలి నగేశ్, గుండెకారి సునీల్, సుమన్, నర్సయ్య, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్‌లో అధికారుల విచారణ



పర్వతగిరి : మండలంలోని అన్నారం గ్రామ శివారులోని దూపతండా ఆకేరు వాగు సమీపంలో నిల్వ చేసిన ఇసుక డంప్‌ను అధికారులతో కలిసి తహసీల్దార్ వెంకటస్వామి బుధవారం పరిశీలించి విచారణ చేశారు. ఇసుక డంపింగ్‌పై కాంట్రాక్టర్ నుంచి వివరణ తీసుకున్నారు. చెక్‌డ్యాం నిర్మాణానికి సంబంధించి ఇసుక డంపింగ్‌కు అనుమతి ఉందని నిర్ధారించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ భారతి, ఏఎస్సై యాదగిరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మ వేషధారణలో కళాకారుల యక్షగానం



రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లిలోని ఎల్లమ్మ వేషధారణలో చిందు కళాకారులు బుధవారం యక్షగానం చేశారు. సుమారు 15 రోజులుగా కళాకారులు యక్షగానంతో జనాన్ని అలరిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంమది. కార్యక్రమంలో కళాకారులు గజవెల్లి కుమారస్వామి, గడ్డం ప్రవీణ్, గడ్డం సులోచన, గడ్డం మానిక తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు



సంగెం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అందించేందుకు ఎమ్మార్సీకి బుధవారం 10 వేల 130 పాఠ్యపుస్తకాలు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓ విజయ్‌కుమార్ మాట్లాడారు. మండలంలోని విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు విడతల వారీగా చేరుకుంటున్నాయని చెప్పారు. పాఠశాలల ప్రారంభానికి ముందే అన్ని రకాల పాఠ్యపుస్తకాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పాఠశాల ప్రారంభం కాగానే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తామన్నారు.

నలుగురిపై కేసు

చెన్నారావుపేట : భూ పంచాయతీ నేపథ్యంలో భౌతిక దాడికి పాల్పడి గాయపర్చిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్ బుధవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఉప్పరపల్లికి చెందిన లింకలపల్లి యాదమ్మ 2.10 ఎకరాల భూమిని తన ఆడబిడ్డ కేతమ్మకు విక్రయించింది. హద్దులు కూడా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తనకు ఇంకా 30 గుంటల భూమి వస్తుందని, హద్దులు సరిగా లేవని గొడవ చేయడంతోపాటు కేతమ్మతోపాటు భర్త కట్టయ్య, కుమారుడు రాంబాబు, కోడలు రాధిక కర్రతో యాదమ్మ, ఆమె భర్త రాములుపై ఈనెల 28న దాడి చేశారు. దీంతో యాదమ్మ, రాములు తీవ్ర గాయాల పాలయ్యారు. యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హరితహారం మొక్కలు సిద్ధం చేయాలి

దామెర : గ్రామాల్లోని నర్సరీల్లో హరితహారం మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ కల్పన సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. హరితహారం మొక్కలు నాటే స్థలాలను గుర్తించి తీర్మానాలు చేయాలని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా కమ్యూనిటీ సోక్ పీట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో ఎంపీఓ రంగాచారి, ఏపీఓ శారద, తదితరులు పాల్గొన్నారు.

‘ఫామ్ ల్యాండ్స్’ నయా దందా

బీళ్లను తలపిస్తున్న పచ్చని పంట పొలాలు

- నాలా పన్ను ఎగవేతతో ఖజానాకు గండి
- చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం



గిర్నిబావి–దుగ్గొండి రోడ్డులో ఏర్పాటైన ఫామ్‌ల్యాండ్

దుగ్గొండి : ఫామ్ ల్యాండ్స్ పేరుతో పల్లెల్లో పదుల సంఖ్యలో నయా వెంచర్లు పుట్టుకొస్తున్నాయి. వ్యవసాయ భూములు ప్లాట్లుగా మారుతున్నాయి. పచ్చని పంట పొలాలు బీళ్లను తలపిస్తున్నాయి. అక్రమార్కులు ప్రభుత్వ నిబంధనల్లోని లొసుగులను సాకుగా చేసుకుని నాలా పన్ను ఎగవేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అయినా చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న దుస్థితి నెలకొంది.

మండలంలోని తొగర్రాయి, నాచినపల్లి, చలపర్తి, మందపల్లి, గిర్నిబావి, తిమ్మంపేట, దుగ్గొండి గ్రామాల పరిధిలో వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. దుగ్గొండి–గిర్నిబావి రహదారి పక్కనే తొగర్రాయి, నాచినపల్లి, గిర్నిబావికి సమీపంలో పదుల ఎకరాల చుట్టూ అందమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రోడ్లు పోసి ఫామ్‌లాండ్స్ పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారులు నయా దందాకు తెర తీశారు. అయినా అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ప్రభుత్వ ఖజానాకు గండి...

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలంటే ప్రభుత్వానికి నాలా పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అమ్మకందారు కొనుగోలుదారుకు రిజిస్ట్రేషన్ ఆఫీసులో నిబంధనల ప్రకారం మార్కెట్ రేటును బట్టి డబ్బు చెల్లించాలి. అలాగే 10 శాతం భూమిని గ్రీన్‌లాండ్ కింద సంబంధిత గ్రామ పంచాయతీలకు అప్పగించాల్సి ఉంటుంది. మరో 15 శాతం భూమిని రోడ్లకు కేటాయించి సదరు భూమిని జీపీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించి అనుమతి పొందాలి. వీటన్నిటినీ తుంగలో తొక్కి, పన్ను చెల్లించకుండానే వ్యవసాయ భూములను కొనుగోలు చేసిన రియల్టర్లు భూమి చుట్టూ సిమెంట్ బిల్లలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రోడ్లు వేసి ప్లాట్లుగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయిస్తున్నారు.

ధరణితో అందివచ్చిన అవకాశం

వ్యవసాయ భూములను ఫామ్ ల్యాండ్ పేరుతో వెంచర్లుగా ఏర్పాటు చేసి విక్రయిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ధరణి అందివచ్చిన అవకాశంగా మారింది. ధరణిలో గుంట భూమి కూడా రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉండటంతో రియల్టర్లు కొనుగోలు దారులకు గుంటల లెక్కన విక్రయిస్తూ తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. తద్వారా ఫామ్‌లాండ్స్ పేరుతో నిబంధనలకు తూట్లు పొడిచి నయా తరహా వెంచర్లుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి దందాకు పాల్పడుతున్న రియల్టర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతోపాటు కొనుగోలుదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

అనుమతి లేని వెంచర్లపై చర్యలు

ప్రభుత్వ అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేయడం తగదు. సదరు రియల్టర్లపై చర్యలు తీసుకుంటాం. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చకుండా ఫామ్ లాండ్స్ పేరిట వెంచర్లు ఏర్పాటు చేస్తున్న విషయమై విచారణ చేస్తాం. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏర్పాటైన ఫామ్‌ల్యాండ్స్‌ను గుర్తించి చర్యలు తీసుకుంటాం. ఫామ్‌లాండ్స్ పేరిట అమ్మకాలు చేస్తున్న ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్‌లో ఇంటి నిర్మాణానికి అనుమతి రాదు. అలాంటి ప్లాట్లను ఎవరూ కొనుగోలు చేయొద్దు. వ్యవసాయ భూములను ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్లాట్లు చేస్తే చర్యలు తప్పవు.

–మోడెం శ్రీధర్‌గౌడ్, ఎంపీఓ

డీలర్లు నిబంధనలు పాటించాలి

- వర్ధన్నపేట ఏడీఏ సురేశ్‌కుమార్



మాట్లాడుతున్న ఏడీఏ సురేశ్‌కుమార్

గీసుకొండ : విత్తనాల విక్రయంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని విత్తన, ఎరువులు, పురుగు మందుల డీలర్లకు వర్ధన్నపేట ఏడీఏ సురేశ్‌కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని కోనాయిమాకులలోని రైతు వేదిక వ్యవసాయ, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో డీలర్లకు ఏర్పాటు చేసిన అవగాహనా సమావేశంలో ఏడీఏ మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో రైతులకు అవసరమైన విత్తనాలు విక్రయించే క్రమంలో నిబంధనలు పాటించాలని చెప్పారు. విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి , రైతులకు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీటీ పత్తి విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. విత్తనం, ఇతర వివరాలను నమోదు చేసి రైతులకు కొనుగోలు సందర్భంగా బిల్లులు అందజేయాలని చెప్పారు. ప్రభుత్వం నిషేధించిన క్రమంలో బీటీ–3 (గ్లైఫోసేట్) పత్తి విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తేటతెల్లం చేశారు. ఏఓ హరిప్రసాద్ బాబు మాట్లాడుతూ డీలర్లు రిజిస్టర్లను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రోజు వారి స్టాక్ వివరాలు, లైసెన్స్ పత్రాలు సరిగా కనిపించేలా ప్రదర్శించాలని చెప్పారు. ఎస్సై షేక్ జానీ పాషా మాట్లాడుతూ డీలర్లు నిబంధనల ప్రకారం విక్రయాలు చేపట్టాలన్నారు. రైతులను ఎవరైనా మోసం చేస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ప్రజ్వల్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధి రాంబాబు, ఏఈఓలు రజిని, విజయ్, కావ్య, తిరుపతి, తేజస్వి పాల్గొన్నారు.

ప్రజాచైతన్యంతోనే సమాజ ఉన్నతి



మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతి

- మామునూరు ఏసీపీ తిరుపతి

సంగెం : సమాజ ఉన్నతిలో ప్రజాచైతన్యమే కీలకమని మామునూరు ఏసీపీ తిరుపతి స్పష్టం చేశారు. పోలీస్ కళాజాత బృందం ఆధ్వర్యంలో మండలంలోని నార్లవాయిలో బుధవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా లూజుగా నకిలీ విత్తనాలు విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. యువత సహవాసాలకు దూరంగా ఉండి చదువుకోవాలని, ప్రజలు ప్రమాదాలు నివారించేలా రోడ్డు నిబంధనలు పాటించాలని, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని చెప్పారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, సీసీ కెమెరాల ఏర్పాటు తదితరాలపై అవగాహన కల్పించారు. గుట్కా, గంజాయి, డ్రగ్స్ బారిన పడొద్దన్నారు. రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేయవద్దని, విత్తనాలు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని తెలిపారు. సైబర్ క్రైమ్స్ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆపద సమయంలో డయల్ 100, సైబర్ నేరాల బారిన పడితే 1930 నంబర్లకు సమాచారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో పర్వతగిరి సీఐ శ్రీనివాస్, సంగెం ఎస్సై నరేశ్‌కుమార్, కళాజాత ఇన్‌చార్జ్ (ఏఎస్సై) నాగమణి, సభ్యులు విలియమ్, రత్నయ్య, శ్రీనివాస్, విక్రమ్‌రాజు, చిరంజీవి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కల్తీని అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యం



ధర్నా చేస్తున్న నాయకులు

నర్సంపేట : విత్తనాల కల్తీని అరికట్టడంలో వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాచర్ల బాలరాజు విమర్శించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడారు. కల్తీ విత్తనాలు అమ్ముతున్న దుకాణాదారులపై చర్యలు తీసుకుని, క్రిమిసంహారక మందుల కల్తీని అరికట్టి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మేరకు దొడ్డు రకం ధాన్యానికి కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ సీజన్ ప్రారంభం నుంచే విత్తనాల కల్తీ జరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు రైతులకు 75శాతం సబ్సిడీపై విత్తనాలు అందించాలని డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ మాట్లాడుతూ ఒకే సారి రెండు లక్షల రుణమాఫీని చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం అమలు చేయకుండా వాయిదా వేయడం దుర్మార్గమన్నారు. వెంటనే రుణమాఫీ అమలు చేయాలన్నారు. అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బండి కోటేశ్వర్‌రావు, గంగుల దయాకర్, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గట్టి కృష్ణ, జక్కుల తిరుపతి, జిల్లా నాయకులు భోగి సారంగపాణి, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పూలక్క, సంధ్య, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు గంధ్రతి హరిబాబు, మల్లయ్య, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లాగౌడ్ ఆదర్శప్రాయుడు



ఎల్లాగౌడ్ (ఫైల్)

సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేటకు చెందిన నారగోని ఎల్లాగౌడ్ ఆదర్శ ప్రాయుడని ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి ఇస్మాయిల్ తెలిపారు. ఎల్లాగౌడ్ (80) అనారోగ్యం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందగా ఆయన మృతదేహాన్ని బాధిత కుటుంబం వరంగల్‌లోని కాకతీయ వైద్య కళాశాల (కేఎంసీ)కు అప్పగించింది. ఈ సందర్భంగా ఇస్మాయిల్ మాట్లాడారు. ఎల్లాగౌడ్ కమ్యూనిస్టుగా శ్వాస ఉన్నంత వరకు ప్రజాసమస్యలపై పోరాడారని తెలిపారు. ఎల్లాగౌడ్ సతీమణి మల్లికాంబ ఆర్నెళ్ల క్రితం మృతి చెందగా ఆయనకు ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. ఎల్లాగౌడ్ గతంలో ఇచ్చిన అంగీకార పత్రం మేరకు అతడి మృతదేహాన్ని కుటుంబీకులు కేఎంసీకి అప్పగించారు. తొలుత ఎల్లాగౌడ్ మృతదేహాన్ని ఎల్గూర్ రంగంపేటకు తీసుకొచ్చి అంతిమయాత్ర నిర్వహించారు. అంతిమయాత్రలో ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యులు కందికొండ ఉప్పలయ్య, ఐలయ్య, సాంబయ్య, వీరస్వామి, శ్రీను పాల్గొన్నారు.

యథేచ్ఛగా విత్తన చట్టాల ఉల్లంఘన



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్

పర్వతగిరి : కొందరు విత్తన వ్యాపారులు ప్రభుత్వ అనుమతులు లేకుండా యథేచ్ఛగా చట్టాలను ఉల్లంఘిస్తున్నారని అఖిల భారత రైతు సంయుక్త సభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్పీ) రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను సకాలంలో అందించేలా కార్యాచరణ చేపట్టాలని, కల్తీ విత్తనాలను నిరోధించడానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘ నాయకులు సురేందర్, శేషనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారం నిర్మాణాన్ని నిలిపేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

రాయపర్తి : మండలంలోని పన్యానాయక్‌తండా గ్రామపంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న కోళ్లఫాం నిర్మాణాన్ని నిలిపేయాలని కోరుతూ తండావాసులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా కోళ్లఫారం నిర్మిస్తున్నారని తెలిపారు. గ్రామస్తులు, చుట్టుపక్కల రైతులు అభ్యంతరం తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే కోళ్లఫారం నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎంపీటీసీ భూక్య క్రాంతి, గ్రామస్తులు రాజారాం, మాలోతు దేశిరాం, నూనావత్ కిషన్, బాదావత్ పీరన్న, శ్రీనివాస్, గోపాల్, బాలాజీ, రమేశ్, సక్రు, లక్ష్మీ, సుగుణమ్మ, బుజ్జి, ముంగాలి తదితరులున్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోండి



విద్యార్థులతో సురేశ్, ఉపాధ్యాయులు

సంగెం : విద్యార్థులు వేసవి శిబిరాలను వినియోగించుకోవాలని ప్రముఖ సైకాలజిస్టు బొజ్జ సురేశ్ కోరారు. మార్గం సేవా సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణా శిబిరంలో విద్యార్థులకు ఆయన నోట్ బుక్కులు, స్టేషనరీ అందజేసి మాట్లాడారు. కష్టపడి ఇష్టంతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. కార్యకక్రమంలో ఉపాధ్యాయులు మాంకాల యాదగిరి, పేర్ల రాజు, కరుణశ్రీ, కిషన్ కుమార్, సంస్థ కార్యదర్శి సింగారపు బాబు తదితరులు పాల్గొన్నారు.

నగదు, బియ్యం సాయం



నర్సంపేట : పట్టణంలోని రాజీవ్‌నగర్ కుమ్మరికుంట కాలనీకి చెందిన భూసాని నర్సింహా ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి డీబీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు జమ్మడి బాబు ఆధ్వర్యంలో నగదు, 25 కేజీల బియ్యం సాయంగా బుధవారం అందజేశారు. తొలుత నర్సింహా చిత్రపటానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో డీబీఆర్‌పీ జిల్లా నాయకులు రాపర్తి జగన్నాథం, నియోజకవర్గ ఇన్‌చార్జి గణిపాక అశోక్, మండల ఇన్‌చార్జ్ కందకట్ల సురేశ్, నాయకులు గండికోట సమ్మక్క, జన్ను పుష్ప, బండి సరోజన తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి..

గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన రాపర్తి కుమారస్వామికు ఆపద్బంధు ఫౌండేషన్ ప్రతినిధి కర్ణకంటి రామ్మూర్తి బుధవారం 25 కిలోల సన్నబియ్యంతోపాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం రామ్మూర్తి మాట్లాడారు. కుమారస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై కదలలేని స్థితిలో ఉన్న క్రమంలో సాయం అందజేసినట్లు తెలిపారు. కుమారస్వామిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

జీలుగ సాగు.. లాభాలు బాగు



శశికాంత్, ఏఓ

చెన్నారావుపేట : జీలుగ సాగుతో అత్యధిక లాభాలు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) శశికాంత్ తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న క్రమంలో ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. పోషకాలను రసాయన ఎరువుల రూపంలో అవసరానికి మించి వాడితే భూ భౌతిక లక్షణాలు మారిపోతాయని చెప్పారు. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ విధానాన్ని పాటించాలని సూచించారు. భూముల్లో పోషకాల లోపం ఉన్నప్పుడు రసాయనిక ఎరువులను అవసరానికి మించి వాడుతున్న క్రమంలో పెట్టుబడులు పెరిగి రైతులకు నష్టాల పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. మొక్కలు పోషకాలను భూమి నుంచి గ్రహిస్తాయని చెప్పారు. సన్న, చిన్నకారు రైతులు కొన్ని పోషకాలను అధిక మోతాదులో ఇవ్వడం, మరికొన్ని పోషకాలు తక్కువగా అందించడంతో సమతుల్యత కొరవడి ఉత్పాదకత తగ్గుతుందని తెలిపారు.

సేంద్రియ ఎరువులతో లాభాలు

సేంద్రియ ఎరువులకు నీటిని పట్టి ఉంచే గుణం ఉంటుందని చెప్పారు. భూసారం పెరిగి పోషకాల మార్పిడి చెందే శక్తి నేలలో పెరుగుతుందన్నారు. నేలలో సూక్ష్మజీవులు వృద్ధి చెంది అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడతాయని చెప్పారు. నేలలో కాలుష్యమూ తగ్గుతుందన్నారు. జీలుగను భూమిలో కలిపి దున్నితే చౌడు శాతం కూడా తగ్గుతుందని చెప్పారు. భూమిలో సత్తువ పెరగడమే కాకుండా పంట సాగు ఆశాజనకంగా ఉంటుందని తెలిపారు. రైతులు పచ్చిరొట్టె పైర్లను సాగు చేసి రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు.

రసాయన ఎరువుల వల్ల కలిగే నష్టాలు

రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడితే నేలలో కాలుష్యం పెరిగి సహజత్వం దెబ్బతింటుందని ఏఓ చెప్పారు. చౌడు సమస్య, సూక్ష్మపోషక లోపాలు ఏర్పడతాయని తెలిపారు. చీడపీడలు పంటలను నాశనం చేస్తాయన్నారు. తద్వారా మొక్కలు బలహీనపడడంతోపాటు దిగుబడులు తగ్గుతాయని వివరించారు.

విత్తనాలు ఉపయోగించే విధానం

పచ్చి రొట్ట విత్తనాలను పొలంలో చల్లి పంట పూత దశలో భూమిలోకి కలియదున్నాలని చెప్పారు. తద్వారా 30–35 శాతం వరకు నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ఖరీఫ్‌కు ముందు పచ్చి రొట్ట ఎరువులను సాగుచేసుకోవాలని సూచించారు. ఎకరానికి 16–20 కిలోల విత్తనాలను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మొక్కలు ఏపుగా పెరిగేందుకు క్రమపద్ధతిలో తడి ఇవ్వాలని చెప్పారు. విత్తనాలు నాటినప్పటి నుంచి 40 రోజుల్లో పంట ఏపుగా పెరిగి పూత దశకు వస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న జీలుగు, జనుము, అలసంద, పిల్లి పెసర, పెసర తదితర పచ్చిరొట్ట విత్తనాలను వానాకాలం సాగుకు కొద్ది రోజుల ముందే చిరు జల్లులు పడే సమయంలో పొలాల్లో చల్లుకోవాలని సూచించారు. జనుము, పిల్లిపెసరను పశువులకు మేతగా ఉపయోగించవచ్చని తెలిపారు. జీలుగను పశువులు తినవని తెలిపారు. వరి నాట్లు వేయడానికి కనీసం 20 రోజుల ముందే నేలలో కలిపి దున్నితే నాట్లు వేసే సమయానికి భూమిలో కుళ్లి సేంద్రియ ఎరువుగా మారి పంటకు ఉపయోగపడుతుందని తెలిపారు.

పచ్చిరొట్టతో లాభాలు

పొలంలో జీలుగను కలియదున్నిన తర్వాత అవి నేలకు, ఆపై వేసే పంటలకు విశేషమైన లాభాలు అందిస్తాయని ఏఓ శశికాంత్ తెలిపారు. ప్రధాన పంటకు ముందస్తుగా నేలను తయారు చేస్తుందన్నారు. జీలుగ సాగుతో మూడు టన్నుల పచ్చిరొట్ట ఎరువుల లభిస్తాయని చెప్పారు. మొక్కలకు 2 శాతం నత్రజని, భాస్వరం, పొటాష్ అదనంగా అందిస్తాయని వివరించారు. జింక్, మాంగనీస్, ఇనుము, కాల్షియం వంటి సూక్ష్మధాతువులను పంటకు చేకూర్చుతాయన్నారు. నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. నేల సహజ మిత్రులైన వానపాముల ఉత్పత్తికి దోహదం చేస్తాయని తెలిపారు. లెగ్యూం జాతికి చెందిన మొక్క కావడంతో వేర్లలో నత్రజని స్థిరీకరణ అధికంగా ఉంటుందని తెలిపారు. కలుపు మొక్కలను అడ్డుకుంటుందని చెప్పారు.

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ చెప్పారు. సబ్సిడీ 60 శాతం పోగా క్వింటా బ్యాగుకు రూ.3,420 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు వ్యవసాయ కార్యాలయంలో పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లు అందించి తీసుకోవాలని కోరారు.

రైతుల ఇబ్బందులు నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్

సంగెం : నకిలీ విత్తనాలను అరికట్టి రైతులకు ఇబ్బందులు నివారించాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) మండల అధ్యక్షుడు గోనె రాంచందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కుంటపల్లిలో బుధవారం నిర్వహించిన ఫెడరేషన్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విత్తన షాపుల్లో తనిఖీ నిర్వహించాలని, నకిలీ విత్తనాలు అమ్మితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు సరిపడా విత్తనాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శివారెడ్డి, జక్క అశోక్, మల్లయ్య, కొమురయ్య సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.